సాక్షి తిరుపతి

సోమవారం । 9 । సెప్టెంబర్ । 2024



వరసిద్ధుని వైభోగం

కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామివారు హంసవాహనంపై దర్శనమిచ్చారు. - 8లో



చవితి వేడుకల్లో ఘర్షణ

వినాయక చవితి వేడుకల్లో శనివారం తలెత్తిన వివాదం రెండు గ్రామాల మధ్య ఘర్షణకు దారి తీసింది. - 8లో



అంతంతమాత్రంగా డిగ్రీ అడ్మిషన్లు

టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న డిగ్రీ కళాశాలల్లో రెండు విడతలుగా నిర్వహించినా అడ్మిషన్లు తక్కువగా ఉన్నాయి. - 8లో

న్యూస్‌రీల్

జిల్లా పోర్ట్‌ఫోలియో జడ్జిగా కృష్ణమోహన్



చిత్తూరు అర్బన్: ఉమ్మడి చిత్తూరు జిల్లా పోర్ట్‌ఫోలియో జడ్జిగా జస్టిస్ బి.కృష్ణమోహన్‌ను నియమిస్తూ రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టు న్యాయమూర్తిగా విధులు నిర్వర్తిస్తున్న ఆయన ఇకపై జిల్లా పరిపాలన న్యాయమూర్తిగా వ్యవహరించనున్నారు. గతంలో జస్టిస్ రఘునందనరావు ఉండగా.. ఆయన స్థానంలో కృష్ణమోహన్‌ను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణం ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 20 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 83,960 మంది స్వామివారిని దర్శించుకోగా 32,342 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.96 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించారని పేర్కొంది.

ఆస్పత్రిలో మరింత భద్రత అవసరం

తిరుపతి తుడా: తిరుపతి రుయా ఆస్పత్రిలో మరింత భద్రత కల్పించాల్సిన అవసరముందని జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు అమీరున్ కోరారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ రుయా అత్యవసర విభాగంలో శుక్రవారం అర్ధరాత్రి విధుల్లో ఉన్న వైద్యులపై పేషంట్ అటెండర్లు దాడి చేసిన ఘటనపై అధికారులు స్పందించిన తీరు అభినందనీయమన్నారు. దాడి జరిగిన వెంటనే ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్, రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు వెంటనే స్పందించి వైద్యులను రక్షించారని, అలాగే పోలీసులకు ఫిర్యాదు చేసి నిందితులను అదుపులోకి తీసుకునేలా కృషి చేశారని కొనియాడారు. అటెండర్లను అపరిమిత సంఖ్యలో అనుమతిస్తుండడం వల్లే ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని ఆరోపించారు. మద్యం మత్తులో ఉన్న వ్యక్తులను ఆస్పత్రిలోనికి ప్రవేశించకుండా నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయం అందించడానికి ఆస్పత్రిలో పానిక్ బటన్ ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.

డాక్టర్లపై దాడి కేసులో ఏడుగురి అరెస్ట్

తిరుపతి క్రైమ్: తిరుపతి రుయా ఆస్పత్రి క్యాజువాలిటీ వార్డు ఎదుట ఈనెల 6వ తేదీన పీజీ డాక్టర్లపై దాడికి పాల్పడిన ఏడుగురు నిందితులను శనివారం అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ వెంకటనారాయణ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించామన్నారు. ఈ మేరకు చింతలచేనుకు చెందిన ఏసీ మెకానిక్ షేక్ షావలీ, షేక్ చాంద్‌బాషా, కృష్ణ బాబు, మణికంఠ, శివకుమార్, సాయికుమార్‌ను అరెస్ట్ చేశామని డీఎస్పీ వివరించారు.

పార్వతీ తనయా.. పాహిమాం..!



కోట మండలం శ్రీనివాససత్రం సముద్రతీరంలో సనత్‌కుమార్ రూపొందించిన సైకత గణపతి

మూషిక వాహనా పాహిమాం.. పార్వతీ తనయా పాహిమాం.. అంటూ జిల్లా ప్రజలు విఘ్ననాథుడిని భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు. ఘుమఘుమలాడే వంటకాలను నైవేద్యంగా సమర్పించారు. సుగంధ సుమాలు.. పండ్లు.. పుష్పాలు.. పత్రితో పూజించి మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే విధంగా మట్టి విగ్రహాలు, సైకత శిల్పాలతో లంబోదరుడిని సేవించుకున్నారు. ఇంటింటా వినాయక వ్రతం ఆచరించి పునీతులయ్యారు. అలాగే గ్రామాలు, పట్టణాల్లో యువత మంటపాలు ఏర్పాటు చేసి భారీ విగ్రహాలతో సందడి చేశారు. వేడుకగా ఉట్లోత్సవం నిర్వహించారు. పలచోట్ల భక్తులకు అన్నదానం చేపట్టారు. – సాక్షి, డెస్క్



తిరుపతి కొంకావీధిలో మత్స్యరూపంలో కొలువైన గణేశుడు

ఓపెన్ ఆఫర్!

అక్షరాస్యత పెంచాలి.. అర్ధాంతరంగా విద్యాభ్యాసం మానేసిన వారికి సైతం మరో అవకాశం కల్పించాలి.. చదువుకోవాలనే ఆకాంక్ష ఉన్నవారిని ప్రోత్సహించాలి.. ఇదే లక్ష్యంతో ప్రభుత్వం ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీని ఏర్పాటు చేసింది. దూర విద్యా విధానం ద్వారా అభ్యర్థుల ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేస్తోంది. అయితే కొందరు స్టడీ సెంటర్ నిర్వాహకులు మాత్రం ఓపెన్ స్కూల్ ఉద్దేశానికి తూట్లు పొడుస్తున్నారు. యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. పాస్ గ్యారెంటీ స్కీమ్ పేరిట ముందస్తుగా తమతో ఒప్పందం కుదుర్చుకున్న వారికే అడ్మిషన్ ఇస్తూ సర్టిఫికెట్‌లను మార్కెట్‌లో పెట్టి ఇష్టారాజ్యంగా అమ్మేస్తున్నారు.





- పాస్ గ్యారంటీ స్కీమ్ పేరుతో వసూళ్లు
- ఓపెన్ స్కూల్ సొసైటీలో యథేచ్ఛగా అక్రమాలు
- ముందస్తుగా ఒప్పందం కుదుర్చుకుంటేనే అడ్మిషన్లు
- ఇష్టారాజ్యంగా దోచుకుంటున్న స్టడీ సెంటర్ నిర్వాహకులు
- అడిగినంత చెల్లించకుంటే సర్టిఫికెట్ ఇవ్వకుండా వేధింపులు

చిత్తూరు కలెక్టరేట్ : చదువుకోవాలనే కోరిక ఉన్న వారి ఉజ్వల భవిష్యత్ బాటలు వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ (దూరవిద్యావిధానం)పై ఆరోపణలు అధికమవుతున్నాయి. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల కింద ఏర్పాటైన మొత్తం 104 స్టడీ సెంటర్లలో అక్రమాలపై తీవ్రమైన విమర్శలు వినిపిస్తున్నాయి. ఏటా ఆయా సెంటర్లతో చేపట్టే అడ్మిషన్ల కసరత్తు నుంచే నిర్వాహకులు అవినీతికి పాల్పడుతున్నారు. అర్ధాంతరంగా చదువు మానేసి, ఇప్పుడు కొనసాగించాలనుకుంటున్న అభ్యర్థులు, గ్రామీణ యువత, మహిళలు, ఉద్యోగోన్నతుల కోసం పరీక్షలు రాసేవారిని మోసం చేస్తున్నారు.

ముందస్తుగా సగం చెల్లించాల్సిందే!

వివిధ శాఖల్లో పనిచేస్తూ ఉద్యోగోన్నతి కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు, ఇతర అవసరాల కోసం పరీక్షలు రాసేందుకు అడ్మిషన్ పొందే అభ్యర్థులు అధికంగా నగదు చెల్లించాల్సిందే. ముందుగా డీల్ కుదుర్చుకుంటేనే అడ్మిషన్ కల్పిస్తారు. ఇలా పది, ఇంటర్‌లో ప్రవేశం పొందే అభ్యర్థులు ముందస్తుగా కుదుర్చుకున్న డీల్ ప్రకారం సగం నగదు చెల్లించాల్సిందే. పరీక్షల సమయంలో విద్యాశాఖ అధికారులతో స్టడీ సెంటర్ నిర్వాహకులు కుమ్మక్కై మాస్ కాపీయింగ్‌కు అవకాశం కల్పిస్తారు. ఈ క్రమంలోనే పరీక్షలు పూర్తి అయ్యాక మిగిలిన డీల్‌లో భాగంగా మిగిలిన సొమ్మును వసూలు చేసుకుంటారు. మొత్తం వ్యవహారంలో విద్యాశాఖ అధికారులకు సైతం ముడుపులు చేరుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓపెన్ స్కూల్‌నే ఆదాయ వనరుగా చేసుకున్న స్టడీ సెంటర్ నిర్వాహకులు రూ.కోట్లకు పడగలెత్తినట్టు సమాచారం.

అడిగినంత ఇచ్చుకోవాల్సిందే!

2023–24 సంవత్సరానికి సంబంధించి పది, ఇంటర్మీడియట్ ఏపీ ఓపెన్ స్కూల్ పరీక్షలకు చిత్తూరు జిల్లా నుంచి 5,703 మంది, తిరుపతి జిల్లా నుంచి 3,965 మంది హాజరయ్యారు. ఇందులో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ప్రైవేట్ సెంటర్ల నిర్వాహకులు సర్టిఫికెట్‌లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. వీరి అక్రమాలను అడ్డుకట్ట వేసేందుకే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభ్యర్థుల చిరునామాకే పోస్టు ద్వారా సర్టిఫికెట్‌లు పంపించే విధానం ప్రవేశ పెట్టింది. అయితే కొంత మంది నిర్వాహకులు మోసపూరితంగా వ్యవహరిస్తూ అడ్మిషన్ సమయంలో అభ్యర్థుల అడ్రెస్ నమోదు చేయకుండా సర్టిఫికెట్‌లు తమకే అందేలా చేసుకుంటున్నారు. అనంతరం అభ్యర్థులు ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం మేరకు నగదు చెల్లించాకే ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్నారు. ఈ విషయం తెలిసినా విద్యాశాఖ అధికారులు కాసులకు కక్కుర్తిపడి నోరు మెదపడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఉభయ జిల్లాల సమాచారం

చిత్తూరు జిల్లాలో ప్రభుత్వ ఓపెన్ స్కూల్ సెంటర్లు	33
ప్రైవేట్ కేంద్రాలు	22
తిరుపతి జిల్లాలో ప్రభుత్వ ఓపెన్ స్కూల్ సెంటర్లు	18
ప్రైవేట్ కేంద్రాలు	31
రెండు జిల్లాల్లో గత ఏడాది పది పరీక్షలు రాసిన వారు	2,451
ఇంటర్ పరీక్షలు రాసిన వారు	7,217

రెగ్యులర్ స్థాయిలోనే విలువ

ఓపెన్ స్కూల్ సొసైటీ జారీ చేసే పదో తరగతి, ఇంటర్ సర్టిఫికెట్‌లకు రెగ్యులర్ ధ్రువీకరణ పత్రాల స్థాయిలోనే విలువ ఉంది. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేందుకు, ఉద్యోగోన్నతులు పొందేందుకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. దీంతో చాలా మంది ఓపెన్‌స్కూల్ వైపు మొగ్గుచూపుతున్నారు. నామమాత్రపు ఫీజుతో అడ్మిషన్ తీసుకుని, నిర్వాహకులు అడిగినంత ముట్టజెబితే దర్జాగా చేతిలో సర్టిఫికెట్ వచ్చేస్తుంది. దీంతో అభ్యర్థుల అవసరం, ఆత్రుతను స్టడీ సెంటర్ నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు.

ఇబ్బంది పెట్టడం వాస్తవమే



ఓపెన్ స్కూల్ విధానంలో అక్రమాలు జరుగుతున్నాయి. అభ్యర్థులను ప్రైవేట్ సెంటర్ నిర్వాహకులు మోసం చేస్తున్నారు. జిల్లా వాసులనే కాకుండా పక్క రాష్ట్రాల వారి నుంచి కూడా భారీగా నగదు వసూలు చేస్తున్నారు. వీరి అక్రమాలను అరికట్టాల్సిన విద్యాశాఖ అధికారులు మామూళ్లకు ఆశపడి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

– శివారెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

భారీగా వసూళ్లు

ఓపెన్ స్కూల్ సొసైటీలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో అడ్మిషన్లు ఇస్తుంటారు. ఈ క్రమంలో స్టడీ సెంటర్ నిర్వాహకులు పాస్ గ్యారెంటీ స్కీమ్ పేరుతో అధిక మొత్తానికి అభ్యర్థుల నుంచి ముందస్తు డీల్ కుదుర్చుకుంటున్నారు. ఇందుకోసం భారీగా నగదు వసూలు చేస్తున్నారు. ఇంటర్మీడియట్ అడ్మిషన్‌కు అపరాధ రుసుం లేకుండా జనరల్ కేటగిరీకి రూ.1,400, రిజర్వేషన్ ఉన్న వారు రూ.1,100 చెల్లించాల్సి ఉంటుంది. పదో తరగతికి అపరాధ రుసుం లేకుండా జనరల్ కేటగిరీకి రూ.1,300, రిజర్వేషన్‌లు ఉన్నవారు రూ.900 చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఈ నిబంధనల ఎక్కడా అమలు కావడం లేదు. ముఖ్యంగా చిత్తూరు, పలమనేరు, కుప్పం, తిరుపతి, గూడూరు, శ్రీకాళహస్తి, పుత్తూరు ప్రాంతాల్లోని స్టడీ సెంటర్ నిర్వాహకులు ఎక్కువ మొత్తం వసూలు చేస్తున్నారు. అందులో తమిళనాడుకు చెందిన అభ్యర్థులకు అధికంగా ఎర వేస్తున్నారు. ఆ రాష్ట్రానికి చెందిన అభ్యర్థులకు పాస్ గ్యారెంటీ స్కీమ్ పేరు చెప్పి మోసాలకు పాల్పడుతున్నారు. పదో తరగతి సర్టిఫికెట్‌కు రూ.50 వేలు, ఇంటర్ సర్టిఫికెట్‌కు రూ.80 వేలు నుంచి రూ.లక్ష వరకు ముందస్తు డీల్ కుదుర్చుకుంటున్నట్లు తెలిసింది.

అక్రమాలకు పాల్పడితే చర్యలు



ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ నిర్వాహకులు ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులనే వసూలు చేయాలి. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించి అక్రమాలకు పాల్పడితే చర్యలు కఠినంగా ఉంటాయ్. ఫిర్యాదులు అందితే వెంటనే సంబంధిత సెంటర్‌ను రద్దు చేస్తాం. పరీక్ష రాసే సమయంలో మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. పది, ఇంటర్‌లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు కచ్చితంగా సర్టిఫికెట్‌లు ఇచ్చేయాలి. నిర్వాహకుల వద్ద సర్టిఫికెట్‌లు ఉంటే సహించే ప్రసక్తే లేదు. – వి.శేఖర్, డీఈఓ

'ఓపీఎస్'తోనే భరోసా!

''పెన్షన్ భిక్షం కాదు.. ఉద్యోగుల హక్కు అంటూ సుప్రీంకోర్టు తీర్పు చెప్పినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం దారుణం. 2004లో పాత పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేసి మమ్మల్ని రోడ్డుపాలు చేశారు. సుమారు 34 ఏళ్లకు పైగా ప్రజలకు సేవ చేసిన ఉద్యోగి జీవితానికి ఆర్థిక భరోసా లేకుండా పోయింది. సీపీఎస్ విధానంతో మా నెత్తిన పిడుగు వేశారు. మళ్లీ యూపీఎస్ అంటూ మోసం చేసేందుకు యత్నిస్తున్నారు. గతంలో అమలు చేసిన ఓపీఎస్ పద్ధతినే మళ్లీ తీసుకురావాలి.. లేకుంటే ఉద్యమం తప్పదు'' అంటూ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు హెచ్చరిస్తున్నాయి. – తిరుపతి సిటీ

- సీపీఎస్ రద్దు చేయాలి
- పాత పెన్షన్ స్కీమ్‌నే అమలు చేయాలి
- హామీ అమలు చేయకుంటే ఉద్యమిస్తాం
- ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు

సీపీఎస్‌తో నష్టం



సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం గౌరవించి పాత పెన్షన్ స్కీమ్‌ను అమలు చేయాలి. సీపీఎస్‌తో ఉద్యోగులకు నష్టం తప్పదు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రతిపాదించిన ఏకీకృత పెన్షన్ స్కీమ్‌తో ఉద్యోగులకు ప్రయోజనం శూన్యం. రాష్ట్ర ప్రభుత్వ తెరమీదకు తెస్తున్న రకరకాల పెన్షన్ స్కీమ్‌లకు మేం వ్యతిరేకం. యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ ఓపీఎస్ స్కీమ్‌ను మాత్రమే అమలు చేయాలని డిమాండు చేస్తోంది. ఓపీఎస్‌ను తక్షణం అమలు చేయకపోతే పోరాటాలకు దిగుతాం. – జీజే రాజశేఖర్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు, తిరుపతి

జీవితానికి భద్రత ఉండదు



కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌తో ఉద్యోగుల జీవితానికి భద్రత ఉండదు. ప్రభుత్వానికి సేవ చేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రోడ్డు పాలు చేస్తున్నాయి. ఎస్టీయూ ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు చేసినా ఓపీఎస్ పట్ల నిర్ణయానికి రాకపోవడం సమంజసం కాదు. ఎన్నికల సమయంలో సీపీఎస్‌ను రద్దు చేస్తామని కూటమి నాయకులు మాట ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడి సుమారు 4 నెలలు కావస్తున్నా ఉద్యోగుల సంక్షేమాన్ని గాలికి వదిలేశారు.

– రమేష్‌బాబు, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు, తిరుపతి

హామీ నిలబెట్టుకోవాలి



కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. పాతపెన్షన్ స్కీమ్‌ను తక్షణం అమలు చేసి తీరాల్సిందే. ఉద్యోగ, ఉపాధ్యాయులకు భరోసా ఇచ్చేది ఓపీఎస్ మాత్రమే. ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయం అంటూ ఎన్నికల సమయంలో కూటమి నేతలు భరోసా ఇచ్చిన ప్రకారం నడుచుకోవాలి. ఉద్యోగుల దగ్గర చందా వసూలు చేసి షేర్ మార్కెట్‌లో పెట్టే పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలి. లక్షల ఉద్యోగ కుటుంబాలు రోడ్డున పడకుండా సీపీఎస్‌ను రద్దు చేయాలి. – ముత్యాల రెడ్డి, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఐక్యంగా ఉద్యమం



సీపీఎస్ రద్దు కోసం పోరాటం చేస్తున్నాం. సీపీఎస్ జాతా పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు చేశాం. ప్రభుత్వ అవసరాలకు, ఉద్యోగులను, ఉపాధ్యాయులను వాడుకుని మభ్యపెట్టే మాటలు చెప్పి అధికారం వచ్చాక ఎన్నికలలో ఇచ్చిన హామీలను గాలికి వదలడం సరికాదు. ఇచ్చిన మాట ప్రకారం పాత పెన్షన్ స్కీమ్‌ను తిరిగి కొనసాగించాలి. లేకుంటే ఐక్యంగా ఉద్యమం చేపడతాం. – జగన్నాథం, ఎస్టీయూ జనరల్ సెక్రటరీ, తిరుపతి

అమలు చేయకపోతే ఆందోళనే



కార్పొరేట్‌లకు మేలు చేసే చట్టాలను తీసుకొచ్చి పాత పెన్షన్ స్కీమ్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తూట్లు పొడిచి ఉద్యోగులను బలి చేశాయి. ఏళ్ల తరబడి ప్రభుత్వానికి సేవ చేసిన ఉద్యోగులకు ఆర్థిక ఆసరాగా ఉన్న ఓపీఎస్‌ను రద్దు చేయడం దారుణం. యూనిఫామ్ పాలసీ అనేది పాత సీసాలో కొత్త సారా అనే చందంగా ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులు సీపీఎస్‌ను వ్యతిరేకిస్తున్నప్పటికీ ప్రభుత్వం పెడచెవిన పెట్టడం సమంజసం కాదు. వెంటనే ఓపీఎస్‌ను అమలు చేయకపోతే ఆందోళన తప్పదు. – దేవరాల నిర్మల, ఏపీ జేఏసీ జనరల్ సెక్రటరీ, యూటీఎఫ్ రాష్ట్ర నేత, తిరుపతి

మాట నిలబెట్టుకోవాలి



ఎన్నికల ప్రచారంలో భాగంగా పవన్ కల్యాణ్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. అధికారం చేపట్టిన వారంలోపు పాత పెన్షన్ స్కీమ్‌ను కచ్చితంగా అమలుచేస్తామని హామీ ఇచ్చారు. సుమారు 4 నెలలు పూర్తి కావస్తోంది. ఓపీఎస్ మాట ఎత్తడం లేదు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేసి ఉద్యోగులకు మేలు జరిగే పాత పెన్షన్ స్కీమ్‌ను అమలు చేయాలి. లేకుంటే ఉద్యోగులు పోరాటాలకు దిగడం తథ్యం. – దూదల పెంచలయ్య, మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ, వెంకటగిరి

యూపీఎస్‌తో ఒరిగేది లేదు



ఎన్నికల సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీని కూటమి నేతలు తూచా తప్పకుండా నెరవేర్చుకోవాలి. కేంద్రప్రభుత్వం సిఫార్సు చేసిన యూపీఎస్ స్కీమ్‌తో ఉద్యోగులకు ఒరిగేది ఏమీ లేదు. గత కొన్ని ఏళ్ల నుంచి ఎస్‌టీయూ ఆధ్వర్యంలో పలు రకాలుగా ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొచ్చినా పట్టించుకోకపోవడం అన్యాయం. ఉద్యోగులకు ఇచ్చిన పాత పెన్షన్ స్కీమ్‌ను తిరిగి కొనసాగించాలి. లేకుంటే ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు పెద్దఎత్తున పోరాటాలకు పిలుపునిస్తాం. – రమణయ్య, ఎస్టీయూ సెక్రటరీ, శ్రీకాళహస్తి

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

తిరుపతి అర్బన్: కలెక్టరేట్ సోమవారం గ్రీవెన్స్ నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నారు. ఈ క్రమంలో అర్జీదారులు తమ సమస్యలను అధికారులకు విన్నవించుకునేందుకు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తిరుపతి నగరానికి కలెక్టరేట్ దూరంగా ఉన్న నేపథ్యంలో గ్రీవెన్స్‌కు వచ్చే వారికి రవాణా సౌకర్యం కల్పించాల్సి ఉంది. అలాగే మూతపడిన క్యాంటీన్‌ను అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది. అర్జీలు రాసేందుకు ప్రత్యేకంగా వీఆర్‌ఓలను ఏర్పాటు చేయాల్సి ఉంది. వినతులకు టోకెన్లు జారీ చేయడంలో అధికారులు శ్రద్ధ వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నిమజ్జనానికి పటిష్ట భద్రత



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి క్రైమ్ : తిరుపతి మంగళం రోడ్డులోని వినాయక సాగర్ వద్ద గణేష్ నిమజ్జనానికి పటిష్ట భద్రత కల్పిస్తున్నట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. ఆదివారం వినాయక సాగర్ కమిటీ సభ్యులు, ఇతర శాఖల అధికారులతో ఏర్పాట్లను పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ సోమవారం అధిక సంఖ్యలో భక్తులు గణపతి ప్రతిమలను భారీగా వినాయక సాగర్‌లో నిమజ్జనం చేసే అవకాశం ఉన్నందున పకడ్బందీ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అవసరమైన చోట బారికేడ్లు పెట్టామని, ప్రమాదాల నివారణకు చర్యలు చేడుతున్నామని వివరించారు. ముఖ్యంగా ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని, ముందుగానే పార్కింగ్ ప్రదేశాలను గుర్తిస్తున్నామని తెలిపారు. పార్కింగ్ ప్రాంతాలకు వెళ్లే మార్గాలను తెలియజేసేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మున్సిపల్ , రెవెన్యూ, విద్యుత్, అగ్నిమాపక శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ నిమజ్జన కార్యక్రమం సజావుగా సాగేలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రజలు సైతం బాధ్యతగా నిబంధనలను పాటిస్తూ సంతోషకర వాతావరణంలో నిమజ్జనోత్సవంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ వెంకట్రావు, డీఎస్పీలు వెంకటనారాయణ, రామకృష్ణ ఆచారి, సీఐ రామ్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.